



శ్రీకాకుళం

కోరికలనంతం. కొన్ని కోరికలు చిత్రమైనవీ, దారుణమైనవీ కూడా. అవి-తీరినా మానినా చిత్ర వధ చేస్తాయి మనిషిని.

* * *

రేవటిని తలుచుకుంటున్నకొద్దీ నీలవేణి ఆత్రుత పెరిగిపోతోంది. మనసునిండా భాద్రపద మాసపు ఈగల్లా ఆలోచనలు ముసురు కొంటున్నయ్ ఝుమ్మంటూ. ఆ ఈగలలో తేనెటీగలూ ఉన్నాయ్. ఏటి మధ్యన ఆడుకుంటూంటే-ఏటికి పోటొచ్చి పొంగి పొంగి వస్తూంటే ఆ ఒడ్డుచేరాలా, ఈ ఒడ్డు చేరాలా అని దూరాలు బేరీజు వేసుకుంటున్న దానిలా తల్లడిల్లిపోతూ తల పోతలలో మునిగిఉంది. గుండె నిండా ఊహలూ, ఆలోచనలూ. కంటికి కునుకురావడం మాట దేవుడెరుగు, రెప్ప పడడం లేదు.

ఇలాకాదని చాప పట్టుకుని గుడిసె బయటకు వచ్చి పరచుకుంది. చలం 'మైదానం' లాటి ఆరు బయలు. ఆకాశం స్వచ్ఛంగా



# చీకటి కొంకటి రంగు

— ఇచ్ఛాపురపు రామచంద్రం

లేదు. అన్నం తిన్నాక తీసెయ్యని మర్రాకుల విస్తరంటులా ఉంది. చందమామ బాగా తోమిన జర్మన్ సిల్వర్ కంచంలా ఉన్నాడు. వెన్నెల-పిచ్చిదాని యవ్వనంలా హద్దూ పద్దూ లేకుండా విరగబడి పోతూంది. మూగగానే వికటా లాడుతూంది. కదలకుండానే వయ్యారాలు పోతూంది. కన్నెపిల్ల కనిపించగానే వెన్నెలకి వెర్రెత్తింది కాబోలు- ఆమెని నానా ఆటలూ పట్టిస్తూ విలవ నీయకుండా నిద్ర పోకుండా చేసేసింది. చల్లగాలికి ఆమె వళ్ళు జలదరించింది. సున్నితమైన పురుష స్పర్శలా చిరుగాలి సరాగమాడితే ఆమె తనువూ, మనసూ కూడా పులకరింతలు పోయాయి. చూపుని ఆకాశం నుంచి క్రిందికు దింపుకొంది నీలవేణి-చూసీ చూసీ విసుగొచ్చినట్లు.

దివి నుంచి భువికి దిగుతున్న ఆమె చూపుకి అడ్డం పడింది నీలం మేడ. అది-నీలం మేడేకాని వెన్నెల్లో నీలంగా లేదు. ఔను-

వెన్నెలకి రెండు రంగులు. నలుపూ, తెలుపూ. ఎండకయితే ఏడు రంగులు. చీకటి కొకటే రంగని స్ఫురించలేదు ఆ క్షణాలలో నీల వేణికి. ఆమె మనసు ఊగుతున్న ఉయ్యాలలా, తిరుగుతున్న రంగుల రాట్నంలా ఉంది. ఆమె దృష్టి నేల మీదకు దిగింది. పరచుకున్న మైదానం- ఆ చివర నీలం మేడ, ఈ చివర తన గుడిసె. రెండిటికీ మధ్య విసుగనిపించేంత విశాల మైన మైదానం. దాన్ని దాటడం ఒక్కొక్కప్పుడు కష్టమనిపిస్తుంది. ఒక్కోసారి సరదాగానూ ఉంటుంది. గమ్మత్తయిన మైదానం. అవతల- నీలం మేడ. నీలం మేడలో మాధవమ్మగారు.

మేడ చూసేసరికి వాణికీ తొణికిన మనసు-అమ్మగారిని తలుచుకునే సరికి విసుక్కుంది. అమ్మగారు జ్ఞాపకాలలోకి రాగానే నీలవేణికి కోపమొచ్చింది. కసొచ్చింది. పగేసింది. వాళ్ళింట్లోనే తన పని. అమ్మగారు మంచిదా అంటే మంచిదే. చెడ్డదా అంటే చెడ్డదే. ఆ యిల్లంతా తన ఒంటి చేతిమీదే నడుస్తుంది. పాచి పని నుంచి పడక లెయ్యడం వరకూ ప్రతిపనీ తనే చెయ్యాలి. చీకటి పడకుండా ఆ యిల్లు చేరితే-చీకటి పడ్డాకే ఆ యిల్లు వదలడం. అంత చాకిరీ. తను ఓ పూట మానేస్తే వాళ్ళకి నోటికి ముద్దందదు. అది-అమ్మగారికీ తెలుసు. అయినా కాతరు చెయ్యనట్లుంటుంది. మిగిలిన సంగతులెలా ఉన్నా పెట్టుపోతలలో మాత్రం ఆవిడది పెద్దచెయ్యే. పావలా దగ్గర రూపాయిస్తుంది. పట్టెడుచోట బుట్టెడు పెడుతుంది. అడిగించుకోకుండానే అంతకంత అందిస్తుంది. తన యిల్లంతా ముప్పొద్దులా గడుస్తూందంటే వారి చలవే. కాని-మనిషికి కడుపు నింపితే సరిపోతుందా? మనసు నింపొద్దూ? పెట్టుపోతల దగ్గర తప్ప అన్ని చోట్లా ఆవిడ తన గొప్పతనాన్ని చూపెట్టుకుంటూ 'నువ్వు తక్కువ దానివే సుమా' అని ఎత్తి పొడుస్తున్నట్లు ప్రవర్తిస్తుంది.

అమ్మగారు కాఫీ తాగుతుంది- తనని చద్దికూడు తిన మంటుంది.

ఆవిడ నైలెక్సులూ, వూలీ వూలీలూ కడుతుంది—తనకేమో నూలుచీరెలే యిస్తుంది.

ఆవిడ మరగ సబ్బులూ, లోషన్లూ వేసుకుని నీళ్ళు పోసుకుంటుంది - తనకేమో కుంకుడు పిప్పి.

ఎండలో ఆవిడయితే అయాసు

క్రీములూ, కూలుడ్రింకులూ-తనకి తరవాణీ, నిమ్మాకు మజ్జిగో.

ఆవిడ పౌడరు పూసుకుంటుంది-తనని పసుపు రాసుకోమంటుంది. వాసన నూనె ఆవిడకీ-కొబ్బరినమురు తనకీ. సాయంత్రం ఆవిడ కుర్చీ వేయించుకునే చోటు వారికి గార్డెన్. తనకయితే వీధి. తనక్కడ పనికి మించి క్షణం నిలుచో కూడదు. తనెక్కడ వినేస్తుందో అని కాబోలు రేడియో కూడా రెండో చెవికి వినపడనంత మెల్లగా పెట్టుకుంటుంది. ఏం? వాళ్ళే కాని తను పాటలు వినకూడదా? పూలమొక్కల్లో చల్లగాలికి కూర్చోకూడదా?

దేముడూ! ఏమిటీ తేడా?

ఆవిడా ఆడదే. నేనూ ఆడదాన్నే. మా యిద్దరికీ యింత వ్యత్యాసం ఎందుకు?

ఆవిడ నిన్ను పూలతో పూజ్జేసి నేన్నిన్ను రాళ్ళతో కొలిచానా? ఆవిడ చేసుకున్న పుణ్యమేమిటి, నేంజేసిన పాపమేవిటి? ఏంవిటీ అన్యాయం? ఎందుకిలా చేస్తున్నావ్? ఎన్నాళ్ళిలా?

పూరీలే తినలేని అమ్మగారికి పలావు లిస్తావ్! కోడికెక్కడీ తిని అరాయించుకో గలిగే నాకు కోడిగుడ్డేనా యివ్వవు! ఎముకల మీద ఏబులం మాంసమూ, గుండెల మీద బెత్తెడెత్తూ లేని అమ్మగారి ఒంటికి కళ్ళు చెదిరిపోయే పిల్కు చీరలు! ఎంత జాకెట్టూ కప్పలేని నా అందానికి వాళ్ళు కట్టి వదిలేసిన పాత బట్టలు. కాలు తీసి కాలుపెట్ట (క్కర్లే)ని ఆవిడ కన్ని జతల జోళ్లా! బొంగరంలా తిరగవలసిన నాకు అరికాళ్ళేజోళ్ళా? ఎలుగుబంటి తోలులాటి ఆవిడ చర్మానికంత క్రీమూ పౌడరూ! పువ్వు రేకులాటి నా ఒంటికి పసుపా? ఆవిడకి చెమట పడితే రక్తం కారినంత రభసా! నాకు రక్తం కారినా నీటి చుక్క పడ్డట్లా? జానెడుండని ఆవిడ జడకి బుట్టెడు పూలు, బారెడు నా జడకి దోసెడయినా పూలుండవు! సినిమా కెడితే ఆవిడగారు మేడ మీదా, నేను కింద బెంచీ మీదానా? బజారు కెడితే కొనడం ఆవిడ వంతూ, మోత నా వంతునా? ఆడదానికీ ఆడదానికీ యింత అంతరం పెట్టేసి—మమ్మల్నిద్దర్నీ ఓ చోట జేర్చి—తగిలించి తమాషా చూస్తున్నావా మాయదారి మొగదేముడూ? నీ దొట్టి మొగబుద్ధి. మేమిద్దరమూ అసూయతో కొట్టుకు చస్తూంటే, కళ్ళల్లో నిప్పులు పోసుకుంటూంటే నీకు తమాషాగా ఉందా?

అమ్మగారూ, అయ్యగారూ, ఓపిల్లాడూ-ముగ్గురికీ అంత మేడ. కూచుందుకొకటీ కునకడానికొకటీ ఊసులాడుకుందు కొకటీ, పూరికే వుండడానికొకటీ గదులు, గదులు, గదులు. ముగ్గురికీ ముప్ఫయ్ గదులు. మరి తమకో? తమ ముగ్గురికీ ఒకటే గుడిసె. చచ్చినా బతికినా దాన్లోనే. వాళ్ళకి పరుపులూ, మంచాలూ. తమకి నేలో,ఈతాకుల చాపో-అంతే గతి.

తనకీ అమ్మగారికీ మధ్య-

తమకీ వాళ్ళకీ మధ్య-

ఈ గుడిసెకీ ఆ నీలం మేడకీ మధ్య-

బారుగా మైదానంలాంటి ఇంత అంతరం ఎందుకు?

ఈ బాధ, ఈ ఉక్రోషం ఈ ఆలోచన-నీలవేణికీ నాటివి కావు. తన తల్లీ, తండ్రీ తనని ఆ మేడలో పనికి కుదిర్చిన మర్నాటి నుంచీ - అంటే ఐదేళ్ళనుంచి. ఇప్పుడు నీలవేణి వయస్సు పందొమ్మిది.

నీలవేణి చదువుకోలేదు- వీధి బడిలో మూడో క్లాసు తప్ప.

ఆమెకు విజ్ఞానం లేదు కానీ జ్ఞానం ఉంది. ఆమె సోషలిస్టు కాదు. ఆమెకటువంటివేమీ తెల్లియవు. ఆమె మొదట యాస భాషే మాట్లాడేది అమ్మగారింట్లోనూ. కాని మెల్లిగా ఆ ఇంటినుంచి మాటలు నేర్చుకుంది. పొగడ్రు మానేసి పొదరనడం, మనిషి ఉన్నంతలో సంస్కారం కలదానిలా కనిపించడం, అమ్మగారే నేర్పించారు. నీలవేణికి అమ్మగారి మీద కోపానికి కారణమేమిటంటే ఆవిడని- "అమ్మగారూ!" అని పిలువమంటుంది. కాని ఆవిడ మాత్రం-"ఏమే నీలీ!" అంటుంది. నీలీ అంటే బాగుండదని కాదు. నీలవేణీ అంటే ఆవిడ నోటి ముత్యాలు రాలిపోతాయా? తనంటే ఆవిడకెందుకంత చిన్న చూపు?

* * *

సృష్టి విచిత్రమైంది. అందులో చీమలూ, గొల్లభామలూ కూడా ఉంటాయి. చచ్చి చెడీ పూవు పూవూ తిరిగి బొట్టు బొట్టూ సేకరించి తేనెపట్టుని పెడతాయి తేనెటీగలు. అంత కష్టాన్నీ అరక్షణంలో అవలీలగా దోచేసుకుంటుంది ఏ ఎలుగుబంటో. మాధవి తండ్రి చాలా సంపాదించాడు-న్యాయంగానూ, అన్యాయంగానూ. రాజుల సొమ్ము రాళ్ళపాలన్నట్లు అతని సంపాదనంతా అల్లుడిపాలయింది. చలపతి గొల్లభామ. జీవితం అతనికో రంగుల కల.

అతనో అపర ఒమర్ ఖయామ్. మాధవి లాటి దాన్ని తను పెళ్ళి చేసు కోడం త్యాగం అంటాడు. అతను మగవాడయినా అందంగా ఉంటాడు. అతనివన్నీ అఘోరకపు అభిరుచులు. మాధవి అతని మార్గంలో ఎదురు నిలవలేక ఓడిపోయి లొంగి పోయింది. వాళ్ళిద్దరూ నామకః మాత్రమే భార్యా భర్తలు. పిల్లల్ని కనడానికి అందమూ ప్రేమాగాక ఆడా మగా తేడా చాలు కనుక, వాళ్ళకీ ఓ బాబు పుట్టాడు.

ఆ వేళ అమ్మగారు లేడీస్ క్లబ్‌కి వెళ్ళారు. అయ్యగారు అల వాటుగా యింట్లోనే పబ్లిక్‌గా తాగు తున్నారు. ఆయనవి కొన్ని దొరల పద్ధతులట. "నీలా!" పిలిచారు. వెళ్ళింది.

"గ్లాసు నింపు" అన్నాడు చల పతి విలాసంగా సిగరెట్ కాలుస్తూ.

నింపి- నిలుచుంది- భయంగా. ఆమెకి తాగేవాళ్ళంటే కొంచెం భయం. అతను తాగి- "నువ్వు నింపావని విస్కీ-కూడా అందంగా రుచిగా ఉంది!"

ఆమె మళ్ళీ నింపింది. అతను మళ్ళీ ఖాళీ చేసాడు.

"గుడ్‌గాళ్! .... కమాన్ .... డాన్స్ చేద్దాం." చేతులు జాచి పిలి చాడు.

ఆమె చాలా భయపడింది. "వ....ద్దు....మీరు....పెద్దవారు."

అతను విరగబడి నవ్వాడు. "పెద్ద! ఎవరు పెద్ద? ఎనిమిదేళ్ళ కుర్రాడికయినా ఎనభయ్యేళ్ళ ముసి లాడి కయినా పద్దెనిమిదేళ్ళ పడుచు పిల్లే కావాలి. అదే మగతనం."

అతని అందం ఎంత ఆకర్ష ణీయంగా ఉందో, ఆ నవ్వంత భయంకరంగా ఉంది. ఆమె బెదిరిన లేడిలా గోడవారకి ముడుచు కుంది. ఆ భయమూ బెరుకూ అతని నవ్వు చూసేకప్పు, తన పరి స్థితినీ, భవిష్యత్తునీ, ప్రమాదాన్నీ అర్థం చేసుకుని ఎంత మాత్రమూ కావు.

ఈసారతను పడి పడి నవ్వి— "ఓసి! ముగ్ధ! మందుపోయాడానికే కాని మరెందుకూ పనికిరావటే అందాల బొమ్మా? మిసమిసలాడు తున్నావని ఆశపడ్డాను" అనేశాడు.

"అ....మ్మ....గా....రు!"

"ఇప్పుడా ఎముకల పోగు సంగ తెందుకు? నీ ముందు—అది గంధం చెట్టుముందు గాలివాన మొక్క. గులాబీ పక్క గడ్డి పువ్వు. అరె! భయపడకు. బలవంతమనేది మన పద్ధతి కానే కాదు. ఇప్పుడు పొర పాటు చేసినట్లు మరెప్పుడేనా అవి పించి మనసు మారితే, నీ అంతట

నువ్వే రా. చులకన చెయ్యనులే. ఇలాటి వ్యవహారా లిద్దరికీ అంగీకార మైతేనే అందమూ,చందమూ."

"అమ్మగారు వస్తున్నారు..."

"వస్తే రానీ - పోతే పోనీ. నాకేం?" మళ్ళీ గ్లాసు నింపుకున్నాడు.

నీలవేణి యావతలకి వచ్చేసింది. ఇప్పుడామెకు భయం తగ్గి ఆనందమూ, గర్వమూ పెరిగాయ్: అందాల రాముడులాటి అయ్యగారే తనని అందాల బొమ్మ అన్నారు! తను నింపితే విస్కీకి కూడా అందమూ, రుచీ వచ్చాయిట! సినిమా హీరోలాటి ఆయనే అంత యిదిగా మెచ్చుకుంటే తన అందమెంత ఘనమైనదని?

అమ్మగారి నవమానించడం.... తన నందల మెక్కించడం..ఆమెకి పరవాన్నం తింటున్నట్లుంది. 'అమ్మగారూ! మీ బండారమిది' అని కసినంతా తీర్చేసుకోవాలని తహ తహలాడిపోయింది. కాని, తీరా అమ్మగా రెదురయ్యేసరికెందుకో జంకేసింది.ఏమయినా నీలవేణి ఆ నాటితో కోటలో పాగా వేసినట్లూ, కొండెక్కినట్లూ సంబరపడిపోయింది. నాటకంలో పాత్రలా అమ్మగారిని గౌరవిస్తున్నట్లు నటిస్తూందేకాని, ఆవిడంటే మనసులో చులకనే నీలవేణికి.

రేపు తెల్లారకుండా అమ్మగారూరికెళ్తారు. ఆ యింట్లో తనే ఉంటుంది. ఇంతవరకూ ఒక్కసారీ అమ్మగా రూరెళ్ళలేదు. రేపెళ్ళి మూడ్రోజులదాకా రారట. అమ్మా నాన్నా కూడా సింహాచలమూ, శ్రీకూర్మమూ వెళ్ళి మూడ్రోజులు వుంటారట. పక్కనున్న పార్వతిని సాయం తెచ్చుకోమంటే— "నాకేం భయమా?ఒక్క రాత్రినే ఉండలేనా?" అంది.

రేపు ఆ యింట్లో తనే ఉంటుంది. అయ్యగారికి హోటలు భోజనం పడదు. తనే వండి వడ్డించాలి. కాఫీలందించాలి. రేపేమిటి జరుగుతుందో? ఎలా ఉంటుందో? ఏమి జరగదా? అయ్యో! ఏమయినా జరుగుతుందా? బాబోయ్! జరగాలి-జరక్కూడదు. జరగాలి - జరక్కూడదు. జరిగితే బాగుణ్ను-జరక్కపోతే మంచిది.

నీలవేణి కెప్పుడు నిద్దర పట్టిందో ఆమెకి తెలియదు. మంచు పడుతుందని అర్ధరాత్రి అమ్మొచ్చి రెక్కట్టుకు నడిపిస్తే, గుడిసెలోకి నిద్ర కళ్ళతోనే నడిచి-పడుకుంది. కలలో కూడా - రేపు - వస్తున్నానంటూ ఊరించడం, రానని బెదిరించడం.

తెల్లగా తెల్లారాక కానీ తెలివి రాలేదు. అప్పటికే అమ్మా, అయ్యా యాత్రకు వెళ్ళిపోయారు. తెలివొచ్చీ రావడంతోనే నీలం మేడకి పరుగెత్తింది. ఇల్లు చేరాక గుర్తొచ్చింది- అయ్యగారు ఆలస్యంగా లేస్తారు, అమ్మగారు లేరు గనుక తొందరగా కాఫీ కాచక్కరలేదు. అమ్మగారు లేకపోడంతో అంతా తీరుబడే అనిపించింది. 'పళ్ళు తోముకుని స్నానము చేసి టిఫినూ కాఫీ తయారు చెయ్యొచ్చులే' అనుకుంటూ అమ్మగారి బాత్‌రూంలోకి నడిచింది. పళ్ళపొడి మానేసి పేస్టు తీసుకుంది. బ్రష్‌తో పళ్ళు తోముకుంది. చందనం సబ్బుతో ముఖం రుద్దుకుంది. తలకి వాసన నూనె రాసుకుంది. బాత్‌రూంలో వేలాడుతున్న అమ్మగారి చుక్కల నైలెక్స్ చీర కట్టుకుంది. అద్దం ముందు అరగంట నిలుచుని-వానిషింగ్ క్రీమ్ పూసుకుని, పౌడరద్దుకుంది. జడలోకి రెండు గులాబిలు తురుముకుంది. ఒక పక్క టిఫినూ, కాఫీ సిద్ధమౌతూంటే- తను కూడా అలంకరణ పూర్తి గావించుకుని ఇంటిమేట్ స్ప్రే చేసుకుని-మళ్ళీ అద్దంలోకి చూసుకుంది హాలులోకి వచ్చి. తన బొమ్మ తనకే ముద్దూ ముచ్చటా వచ్చేస్తూంటే తనని తాను అద్దంలో చూసుకుంటూ అలా ఎంతసేపు నిలుచుందో ఆమెకే తెలియదు. ఆమె ఈ లోకంలో లేదు. కలల లోకంలో ఊహల ఉయ్యాల లూగుతూంది. ఆమెకు గొప్ప తృప్తిగా ఉంది. అమ్మగారు కట్టే చీర కట్టి ఆమెలా అలంకరించుకుంటే తనింత అందంగా ఉంటుందన్నమాట!

"డార్లింగ్! ఇంకా గుడ్ మార్నింగ్ చెప్పలేదు-కాఫీ యివ్వలేదు." వెనుకపాటున కౌగిలింత. చెంపల మీద ముద్దు. ఆమె నిలువెల్లా ప్రకంపనల పరంపరలు. భయం.

"నేను ..అమ్మగారు..." పెదవుల వణుకు. మాటల తొణుకు.

"సారీ!" ఆమెను వదిలి- అద్భుతం ఎదురైనట్లు చూస్తూ, "లవ్‌లీ! వండర్ ఫుల్! దిగివచ్చిన దేవతలా...కదిలొచ్చిన కన్నెపూవులా...ఎంత బాగున్నావ్! ఈ చీర కాదు-మొన్న అమ్మగారు తీసుకున్నారే ఊదా రంగు మీద పూల వూలీ వూలీ-అది కట్టుకో. చీర సార్థకమౌతుంది."

నీలవేణికి ఆ మాటలతో తేనెలో స్నానం చేసినట్లయింది. రొొప్పె

విరిగి నేతిలోనో వెన్నలోనో పడ్డట్లుంది.

"మీరు టిఫినూ, కాఫీ తీసుకుందురు గాని." వెళ్ళి తెచ్చింది.

"నువ్వూ తెచ్చుకో!"

"తరవాత తింటాను."

"ఉహుం-నీ పక్కన కూర్చుని తింటే-జన్మ ధన్యమౌతుంది.ప్లీజ్! నీలవేణీ..." ఆమె గెడ్డం పట్టుకునే బతిమాలాడు. ఆమె మంచులా కరిగిపోయింది.

తరువాత అతను చాలా ఎక్కువ కవిత్వమే చెప్పాడు. ఆమె మాటలు వీణమీటులన్నాడు. ఆమె అందం వర్ణనాతీతం అన్నాడు. రాణి వన్నాడు. గులాబీ బాల వన్నాడు. అదన్నాడు, యిదన్నాడు. చాలా అన్నాడు. కార్య సాధకులు ఎన్ని శ్రమలయినా పడతారు కదా?

"ఈ యింటికి దొరసానివి నీవే" అని కూడా అన్నాడు. ఆమె పొంగిపోయింది. మంత్ర బద్ధ అయింది. అమ్మగార్ని జమాం చేస్తున్నానన్న ఆనందం ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసి వదిలింది.

అతను బీరువా తాళాలిచ్చి-"నీకు నచ్చిన చీరకట్టుకుని నగలు పెట్టుకో" అన్నాడు.

నీలవేణికి మరో లోకంలో ఉన్నట్లుంది. భోజనానికి ముందు-షవర్ బాత్ చేసింది. బేదింగ్ లోషన్స్ వాడింది. యుడికిలోన్ అద్దుకుంది. తనకి చాలా నచ్చిన చీరకట్టుకుంది. సెంట్ స్ప్రే చేసుకుంది. తన కోరికలన్నీ ఆత్రంగా తీర్చేసుకుంది. అమ్మగారి నగలు పెట్టుకుంది. అయ్యగారితో కలిసి భోంచేసింది.

"నాకు బీరుపోసి-నువ్వు ఆపిల్ జ్యూస్ తీసుకో. చాలా వేడిగా అనిపించడం లేదూ యిక్కడ?"

"ఊఁ." వెళ్ళి ఫ్రిజ్ తెరిచి డ్రింక్స్ పోసింది యిద్దరికీ. చల్లని ఆపిల్ జూస్ గొంతుదిగుతూ కడుపులోకి వెళ్తుంటే భలేగా అనిపించింది. అయ్యగారు రమ్మంటే-ఎయిర్ కూల్డ్ గదిలోకి నడిచింది. అక్కడ - చల్లగా చక్కగా ఉంది. గదిగోడలకి నీలం రంగు. అది- పడకగది. అమ్మగారుంటే తన నడుగు పెట్టనివ్వదు. ఇప్పుడు?

పల్లకీలాటి మంచం. పాల పొంగులాటి నురగ పరుపు. దాని మీద పూలదుప్పటి. కూర్చుంటే హంసరెక్కలా ఎంత బాగుందో! నిద్దరొచ్చేసేటట్లుంది - చల్లదనానికీ మెత్తదనానికీ. గదిగోడల అద్దాలలో తను. మైకం కమ్ముతోంది హాయితో. ఆకాశంలో ఎగురు

తున్నట్లు...ఏమిటో ఔతున్నట్లు.... వాళ్ళు మడుపు. తనకేమైంది?

అయ్యగారు తన బుగ్గలని ముద్దాడుతున్నారు. "స్వీటీ-స్వీటీ" అంటూ తనని చుట్టుకున్నారు.

ఆమె మురిసిపోయింది. మైమరచిపోయింది. ఆతనికి కావలసిందీ అదే. అకాశంలో చుక్కల్ని చూపుతూ నేలమీద చీమల-పాముల పుట్టలమీద నడిపిస్తున్నాడు. పిల్లకాకికి ఉండేలు దెబ్బ తెలియనివ్వనేమో కాని, నీలవేణిలాటి కన్నెపిల్లకు చలపతి వంటి వాళ్ళు తన చుట్టూ నేర్పుగా పరిచే తీయని కలల రంగుల వల కవతల పొంచి ఉన్న భయంకర భవిష్యత్తు తెలియదు-తెలియదు-తెలియదు. చలపతి తనను మెల్లమెల్లగా ఆక్రమించుకోడమూ ఆమెకి తెలియలేదు. ఎయిర్ కూల్డ్ గది, హంసరెక్కలాటి పక్క, వంటినించి వస్తున్న ఇంటిమేట్ సువాసనలు, వొంటిమీది ఖరీదైన వూలీవూలీ కితకితల స్పర్శ, మొదటిసారిగా మగ కౌగిలి! ఆమె మంత్రబద్ధ ఐపోయింది. ఆమెకు తెలియకుండానే చాలా జరిగిపోయింది.

మూడు పగళ్ళూ, రెండు రాత్రులూ ఆమె ఆ ఇంట్లో సర్వాధికారిగా గడిపింది. చలపతి ఆమెను దొర (గారి) సానిలాగే భావించుకున్నాడు. ఆ రాత్రి ఆమె అతని కౌగిటిలో ఉండగా ఫోన్ మోగింది.

"ఇంత అర్ధరాత్రి బయలుదేరడమేం? చల్లగా ఉంది- పొద్దుటికే వచ్చెయ్యొచ్చునా? సరే" అని ఫోన్ పెట్టేసి, "నీలవేణీ! నువ్వికనింటికి వెళ్ళిపో" అన్నాడు.

పిడుగుపాటులా తోచిందామెకయ్యగారి మాట. నిలువు గుడ్లేసుకుని చూసింది.

"అమ్మగారు వస్తారు. నువ్విక్కడుంటే బాగుండదు. నీకే ముప్పు. నిన్ను పన్లోంచి తీసేస్తుంది." ప్రేమపాట విన్న నోట దుష్టమాట వినవలసిరాగా విభ్రాంతి చెందినట్లు చూసింది నీలవేణి.

అయ్యగారికి చిరాకెత్తినట్లుంది. "ఏమిటలా మొద్దులా నిలబడి మిడిగుడ్లేసుకు చూస్తావ్?"

నీలవేణి ఆకళింపు చేసుకోలేకపోతోంది. ముచ్చటగా మూడు రోజులైనా కాకుండా తన ముద్దుల గుమ్మ కాస్తా మొద్దయిపోయిందా? కలువరేకుల కన్నులు మిడి గుడ్లయ్యాయా? ఆమె కలలు పగిలి, గుండెలు రగిలి కన్నీళ్ళొస్తున్నాయి. అమ్మగారి మీద తాను తీసుకున్న గెలుపు గర్వం తాలూకు ఛాయలు కూడా మిగలకుండా అయిపోయిం

దామె మనసు.

"కదులు. నీ లాటిదానికి నే విచ్చిన అనుభవం మామూలుగా అందేది కాదు. పదిలంగా దాచుకో. తల్చుకుంటూ బతుకు. ఊఁ- కదల వేం? ఆ చీర విప్పేసి నీ చీర కట్టుకో. ఆ నగలన్నీతీసి బీరువాలో పెట్టేయ్. త్వరగా!"

మరబొమ్మలా వేషం మార్చు కుంది నీలవేణి.

"తాళికట్టిన పెళ్ళాంలా చెబు తుంటే కదలవేం? ఏమిటా మొండి తనం?" కసిరాడు.

"ఈ అర్ధరాత్రి... చీకట్లో..." తను ఆడమనిషనీ_భయమనీ గుర్తు చేసింది ఏడుస్తూ.

ఆయన - మనిషిలా కాక- మృగంలా గర్జించాడు. "గెటౌట్ యూ బిచ్!"

చెట్టునున్న పువ్వుని చేతితో సున్నితంగా స్వీకరిస్తారు. ఆ పూవే వాడిపోయాక చీపురుతోనో, కాలి తోనో తుడిచేస్తారు ధూళిలోకి, దుమ్ములోకి. కాలుజారి అంది పోయిన అమ్మాయి గతి-చెట్టు జారిన పువ్వే మరి.

ఆతని మాటలకు అర్థం తెలి యకపోలేదు నీలవేణికి. ముఖ్యంగా గెటౌటికి, బిచ్‌కి.

ఆమెకి విజ్ఞానం లేకపోయినా జ్ఞానం వుంది. సినిమాలు చూసీ, ఆ ఇంట్లో మసిలీ ఆ మాత్రం భాష పట్టుకోలేకపోలేదు. అర్థాలు తెలిసిన ఆ మాటలు ఆమెకి చాలా ఏడుపు తెప్పించాయి.

"వేషాలెయ్యకు. వెధవేడుపు లేదవకసహ్యంగా.నీకు కావలసింది డబ్బేగా?" వంద రూపాయలనోట్లు మూడో నాలుగో విసిరి, "నీక్కా వలసినవి కొనుక్కో. త్వరగా పో" అన్నాడు.

నీలవేణికి ఏడుపూ, నవ్వూ కూడా వచ్చాయి. ఆశా, నిరాశా కూడా కలిగాయి. ఆ డబ్బుతో చీరలు కొనుక్కోవచ్చు. నగలు, పౌడర్లు, సబ్బుబిళ్ళలు, సెంట్లు కొనుక్కోవచ్చు. కాని గడచిన 3 రోజులని తను ఎంత డబ్బుతోనూ కొనుక్కోగలదా?

"రాస్కెల్! నన్ను బ్లాక్ మెయిల్ చేద్దామనా? మర్యాదగా వెళ్ళవా?" తాగిన విస్కీకిక్కూ, రేగిన కోపపు నిక్కూ, నీలవేణి మెడపట్టుకుని బయటకు గెంటే శాడు ఒక్క ఉదుటున.

ఆమె గేటు దాటి పడింది అయ్యగారి బలంవల్ల కాదు-తన బలహీనత వల్ల. పడి లేచి, వెను దిరిగి చూసింది. వెక్కిరిస్తున్నట్లూ, వెళ్ళమన్నట్లూ ఆ నీలం మేడ.

అర్ధరాత్రి రోడ్డుమధ్య ఒంటరిగా తను. ఆమెకి చాలా ఏడుపు వచ్చింది. స్వేచ్ఛగా-గుండెలనిండా-కళ్ళనిండా- మనసునిండా ఏడ్చు కుంది. అప్పటి కామె గుండే, మనసూ తేలికై వివేకం కన్ను తెరచి అమ్మగారు గుర్తువచ్చారు. ఆకులా వణికిపోయిందామె.

'అమ్మగారూ! నన్ను క్షమించండి. నేను మీకు ద్రోహం చేశాను. అన్యాయం చేశాను. అన్న మెరుగని నాకు అన్నం పెట్టారు. మాటరాని నాకు భాష నేర్పారు. లోకమెరుగని నాకు ప్రపంచం చూపారు. నన్ను మనిషిని చెయ్యబోయారు. కాని-నేనేం చేశాను!


# శ్రీ బాలాజీ వైద్యశాల

## సెక్సుస్పెషలిస్టు డా॥ సి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద, ఫోను: 551, తెనాలి (ఎ.పి.)
బ్రాంచి: 28, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17

## దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క దోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టుద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు:- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.

నా కంటె మీ రెక్కువేమిటను కున్నాను. నా వయసు చూసుకుని అదిరిపడ్డాను. తీరు చూసుకుని తూలిపడ్డాను. మిమ్మల్ని చూసి నవ్వబోయాను. మీ స్థానాన్ని ఆక్రమించా లనుకున్నాను. పెట్టిన చెయ్యనే పట్టుక్కున కరవ బోయాను. ఆదరించిన మనిషినే అవకలకి నెట్టెయ్యబోయాను. కాని-దేముళ్ళేడూ! ఉన్నాడున్నా డున్నాడున్నాడు. మంచి గెలవదూ! గెలుస్తుంది—గెలుస్తుంది—గెలుస్తుంది. ఎవరి కీడు వాళ్ళనే కొట్టదూ! కొట్టేస్తుంది-కొట్టేస్తుంది- కొట్టేస్తుంది. అదే జరిగింది. సరిగ్గా అలాగే జరిగింది. అందుకే- వెక్కిరించబోయి వెల్లకిలా పడ్డాను. మిమ్మల్ని చూసి నవ్వబోయి నేనే నల్లరాయి మీద జారిపడి నా బతుకే బద్దలు చేసుకున్నాను. అయ్యగారికి రాణినౌదా మనుకుని-సానినయ్యాను ఆయనది నా మీద ప్రేమనుకున్నాను. కాని—ఆయన కాడదాని వాళ్ళే తప్ప వలపక్కర్లేదని నా కిప్పటి వరకూ తెలియదు.

ఇక నేను మీ కంట పడను. నన్ను క్షమించి మరచి పొండమ్మ గారూ-మరచిపొండి. నేంజేసిన పాపానికి మీకు ఎదుట పడి సెలవు తీసుకునే భాగ్యం దక్కకపోయింది. నా గురించి ఆలోచించకండి. ఈ గడ్డి పువ్వుని తలుచుకోకండమ్మా-తలుచుకోకండి. మరచి పొండి.'

ఏడిచేడిచి అలసిపోయింది నీలవేణి.

ఇప్పుడు ఆమె ఎదురుగా రెండు తోవలున్నాయి.

నీతి నియమాలకీ, మంచి పేరుకీ గణన కెక్కిన తల్లిదండ్రులుండే గుడిసెకి తీసుకెళ్ళే దారి ఒకటి.

రెండోది-ఎవరూ ఆదుకుందుకూ, ఆప్యాయ తానురాగాలందించేందుకూ ఉండని అరణ్యం లాటి ఏకాంత ప్రపంచానికి తీసుకుపోయేది.

ఎటు వెయ్యాలి అడుగు!

నీలవేణి ఎటు అడుగు వేయాలో తెలియక అచేతనంగా మిగిలిపోయింది. అడుగు వెయ్యడానికే అదిరిపాటుగా ఉందామెకు.

ఏ క్రూర కారు మబ్బు కమ్మేసిందో కాని-వెన్నెల రాత్రి కూడా చీకటే కాస్తూంది.

నీలవేణి నిశ్శబ్దంగా గొణుక్కుంది-'ఎండ కేడు రంగులు. వెన్నెలకి రెండు రంగులు. చీకటి కొకటే రంగు-నలుపు. చెడిపోయిన కన్నెపిల్ల బతుకంతా చీకటే-నలుపే. చీకటి నలుపే-నల్ల చీకటే!' *